తల్లిదండ్రుల ఆశయాలను సాకారం చేయాలి

కలెక్టర్ డా. ఏ.మల్లిఖార్జున

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రభుత్వ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, తమ తల్లిదండ్రుల ఆశయాలను, కలలను సాకారం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.మల్లిఖార్జున పిలుపునిచ్చారు. స్థానిక ఇసుక తోట వద్ద గల ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతి గృహం పునః నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖపట్నం పోర్ట్ అథారిటీ అందించిన రూ. 29 లక్షల సి.ఎస్.ఆర్ నిధులతో ఈ వసతి గృహ పునః నిర్మాణ పనులను చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికే సి.ఎస్.ఆర్ నిధులతో భీమిలి ప్రాంతంలోని వసతి గృహాలను కూడా ఆధునీకరణ, మరమ్మతు పనులు చేపట్టిన సంగతిని కలెక్టర్ గుర్తుచేశారు.

జిల్లాలో చాలామంది పారిశ్రామిక వేత్తలు ఉన్నారని, వారి సి.ఎస్.ఆర్ నిధులతో వసతి గృహాల ఆధు నీకరణ చేస్తామని తెలిపారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి కె.శ్రీదేవి, సమగ్ర శిక్ష ఉప కార్య నిర్వాహక ఇంజినీర్ డి.వి.నర్సింహరావు, సహాయ బి.సి. సంక్షేమ అధికారులు ఎస్.వసంతకుమారి, బి.వి.రమణ, ఐ.జ్యోతీశ్రీ పాల్గొన్నారు.

అంగన్వాడీల ఉద్యమానికి సీపీఐ సంఘీభావం

విశాలాంధ్ర - చింతపల్లి: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక దీక్షలకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుంది. ఇందులో భాగంగా చింతపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మెకు సీపీఐ ఎర్రబొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సెగ్గే సత్తిబాబు పరిపూర్ణ మద్దతు ఇస్తున్నారు. ప్రతిరోజు సిపిఎం పార్టీ నాయకులు, అంగన్వాడీలతో ఆయన కూడా ఉద్యమాన్ని ఉధృతంగా ముందుకు తీసుకువెళు న్నారు. ఈ క్రమంలో సీలేరు నుండి చింతపల్లి వచ్చిన ఫుడ్ కమీషన్ చైర్మన్ అద్దగింతలోనూ సీపీఎం నాయకులు, అంగన్వాడీలతో కలసి ఆయన గళాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీ లన్నీ అధికారంలోకి రాక ముందు ఒక మాట అధికారంలోకి వచ్చాక మరొక మాట మాట్లాడుతూ అంగన్వాడీలను మభ్యపెడుతున్నాయన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరిస్తున్నారని ఆరో పించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల న్యాయమైన డిమా ండ్లను పరిష్కరించేందుకు ముందుకు రావాలని ఆయన డిమాండ్ చేశారు.

యువగళం ముగింపు సభకు తరలిరండి

విశాలాంధ్ర - వి.మాడుగుల: ఈ నెల 20న జరిగే యువగళం ముగింపు సభకు తరలిరావాలని మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని జమ్మాదేవిపేట గ్రామంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం భోగాపురం మండలం పోలిపల్లి గ్రామంలో ముగింపు సభ జరుగుతుందన్నారు. ఈ సభకి చంద్రబాబునాయుడు, నందమూరి బాలకృష్ణ, జనసేన పార్టీ నాయకులు హాజరవుతారన్నారు. ఈ ముగింపు సభకి మాడుగుల నియోజకవర్గం నుంచి 5000 మందితో సభలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీడికాడ మండల పార్టీ అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు, మాజీ సీడీసీ చైర్మన్ మజ్జి తాతబాబు, మాజీ బీసీ సెల్ అధ్యక్షులు లెక్కల కాసుబాబు, సర్పంచ్ సుంకరి సింహచలంనాయుడు, ఎంపిటిసి పైల ముత్యాలనాయుడు, మండల యూత్ అధ్యక్షులు వద్ది రాజకుమార్, మరువాడ ఈశ్వర రావు, కోరుకొండ రాజుబాబు, సిహెచ్.కల్యాణ చక్రవర్తి, బీమేష్, నారాయణరావు, కోన చంటి,ఢిల్లీ నానాజీ, కొండలరావు, నారాయణ స్వామి పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం

విశాలాంధ్ర - పరవాడ: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు పరవాడలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. శనివారం రాత్రి మునగపాక మండలం తోటాడ పంచాయతీ పరిధి స్మార్ట్ సిటీ లేఔట్‌లో బస చేసిన లోకేష్ తిరిగి ఆదివారం ఉదయం పాదయాత్రను ప్రారంభించారు. తోటాడ, వెంకటాపురం మీదుగా సాగిన పాదయాత్ర మధ్యాహ్నం ఒంటిగంటకు భరణికంలోకి ప్రవేశించింది. పెద్దఎత్తున టీడీపీ, జనసేన నాయకులు, మహిళలు, అభిమానులు స్థానికులు లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పరవాడ నుంచి అనకాపల్లి రోడ్డు విస్తరణ కోసం వినతి పత్రం అందజేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పంచ గ్రామాల సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. భోజన విరామం అనంతరం భరణికం నుంచి పరవాడ మీదుగా పాదయాత్ర కొనసాగింది. పరవాడలో సంత బయలు వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహానికి లోకేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. స్థాని కుల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ప్రతీ కూడలి వద్ద లోకేష్‌కు గజమాలలతో ప్రజలు స్వాగతం పలికారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ జనసేన పార్టీ అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తదితరులు ఘన స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

డి.ఎస్.నకరా రుణం తీర్చుకోలేనిది

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పింఛను పొందుతూ గౌరవ మర్యాదలతో జీవించడానికి కారణం స్వర్గీయ డి.ఎస్.నకరా అని పింఛనుదారుల సంఘం అధ్యక్షులు వి.జగన్నాథ రావు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ ఆయనకి ఎంతో రుణపడి ఉండాలన్నారు. 1882లో ఇదే తేదీన పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు (పెన్షనర్ల) గౌరవం మర్యాదలకు హామీ ఇస్తూ సుప్రీంకోర్టు కీలక మైన పింఛను తీర్పును వెలువరించిందన్నారు. ఆయన గుర్తుగా మన దేశంలో డిసెంబర్ 17న పెన్షనర్స్ డే జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పింఛను పొందడం వారి హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. అనకాపల్లి జిల్లా ట్రెజరీ అధికారి వి.ఎల్.సుభాషిణి మాట్లాడుతూ ప్రస్తుత సుప్రీంకోర్టు చీఫ్ జడ్జి తండ్రి వైవి చంద్ర చూడ్ ఆధ్వర్యంలో ఉన్న బెంచ్ ఈ తీర్పును వెలువరించారని తెలిపారు. ఇంకా పింఛనుదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను గూర్చి వివరించారు. పెన్షనర్లు అందరూ జనవరి 1వ తేదీ నుండి ఫిబ్రవరి 29వ తేదీలోగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని చెప్పారు. అనారోగ్యంతో ఎవరైనా బాధపడుతూ ఉంటే వారి వద్దకు తమ సిబ్బందిని పంపించి వారి ఇంటి వద్దే లైఫ్ సర్టిఫికెట్స్ సమర్పించవచ్చుని చెప్పారు. సంఘ కార్యదర్శి బివిఎల్ఎన్ శర్మ నకారి సాగించిన పోరాటం గూర్చి వివరించారు. తర్వాత 80 సం.లు నిండిన ఐదుగురు పింఛనుదార్లను, డీటీఓ వి.ఎల్.సుభాషిణి ఎస్.టి.ఓ సయ్యద్ హలీమ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కే.సుబ్రహ్మణ్యం జిల్లాలోని పెన్షనర్లు పాల్గొన్నారు.

జిప్సా సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - గాజువాక: గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం(జిప్సా) సర్వ సభ్య సమావేశం పాతగాజువాక యశోదా విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఈ నెలతో ప్రస్తుత జిప్సా కార్యవర్గ కాలపరిమితి 2సం.లు పూర్తి అవుతున్నప్పటికీ కరోనా కారణంగా 2021 డిసెంబరు నెలలో ఎన్నికలు నిర్వహించుకోవడం జరిగిందని కానీ ఇప్పుడు గతంలో మాదిరిగా ఈ విద్యా సంవత్సరం పూర్తి అయిన తర్వాతనే వచ్చే ఆగస్టు నెలలో ఎన్నికలు నిర్వహించి కొత్త కార్యవర్గం ఎన్నుకోవడం జరుగునని, అంతవరకు ప్రస్తుత కార్యవర్గం మాత్రమే పనిచేస్తుందని సమావేశంలో పాల్గొన్న సభ్యులందరూ

ఏకాభిప్రాయం వ్యక్త పరిచారు. అనంతరం జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రెన్యువల్ విషయంలో ఉన్న సమస్యలు వాటి పరిష్కా రాలు సభ్యులకు వివరించారు. ఇటీవల జిప్సా రాష్ట్ర అప్సా సంఘం తో అనుసంధానం అయిన దృష్ట్యా జనవరి నెలలో జిల్లా అప్సా మరియు జిప్సా సభ్యులతో కలిసి భారీ విహార యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిప్సా ప్రధాన కార్యదర్శి బి శ్రీనివాస్, కోశాధికారి డి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు శోభన్ బాబు, సలహాదారు యమ్ జగ్గారావు, మురళీ, జగన్, పరశురాం, వాసుదేవరావు తదితరులు సుమారు 70మంది వివిధ పాఠశాలల కరెస్పాండెంట్స్ పాల్గొన్నారు.

యువగళంను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: అగనంపూడిలో సోమవారం జరగనున్న యువగళంను విజయవంతం చేయాలని కోరుతూ 75వ వార్డులో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి పర్యటించారు. నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్ర సోమ వారం విశాఖ పార్లమెంటరీ పరిధిలోని గాజువాక నియోజక వర్గం అగనంపూడి పైలాన్ వద్ద ముగుస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నాయకులు దొమ్మేటి అప్పారావు, ములకలపల్లి పెంటయ్య, ఉరుకుటి వెంకట రావు, మొల్లి అప్పారావు, అండిబోయిన రాము నాయుడు, మొల్లి అప్పారావు, సూరిబాబు, బస అప్పలరెడ్డి, కాకినాడ అప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఘటనతోనే దళిత హక్కుల సాధన

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రతిఘటనా, ఉద్యమాలతోనే దళిత, బహుజన హక్కులను సాధించగలమని పలు దళిత, ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. నగరంలోని డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం హాలులో దళిత విముక్తి 25 ఏళ్ల ప్రస్థానం సందర్భంగా ఆదివారం ప్రతిఘటనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూర్వ ఐఐఎస్ అధికారి డాక్టర్ వి.జె.సుధాకర్ మాట్లా డుతూ భారతదేశంలో కులమే అన్ని సమస్యలకు మూలంగా ఉందన్నారు. దేశ ప్రజలకు రాజ్యాంగం ద్వారా మానవ హక్కుల రక్షణ కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. రాజ్యాంగ హక్కులన్నీ పోరాటాలతోనే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. లీడర్ పత్రిక ఎడిటర్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ దళితులను బానిసలుగా చూస్తున్నారని అంబేద్కర్ సిద్ధాం తాలకు వ్యతిరేకంగా గత 75 ఏళ్లుగా పాలన కొనసాగు తుందన్నారు. పెందుర్తి మండలం ముదపాకలో దళితుల భూములు బలవంతంగా లాక్కున్నారని మండిపడ్డారు. కోట్ల రూపాయల విలువ చేసే భూములను ల్యాండ్ పూలింగ్ పేరుతో లాక్కుని దగా చేశారన్నారు. సద స్సుకు అధ్యక్షత వహించిన దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ మాట్లాడుతూ కుల నిర్మూలనా పోరాటాల్లో అనేకమంది దళితులు అమరులయ్యారని, వారి పోరాట స్ఫూర్తిని స్వీకరించాలన్నారు. దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ నగరంలోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ అనేక మంది నివాసం ఉంటున్న దళితుల స్థలాలను లాక్కొంటున్నారని దానిని ఎదుర్కొని దళితులంతా నిలబడాలన్నారు. దళితులు పోరాడి సాధించుకున్న 27 సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా నిలిపివేసిందని మండిపడ్డారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చివేసి దాని స్థానంలో మనువాదాన్ని తీసుకొచ్చే కుట్ర సాగుతుందని దీన్ని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, భారత నాస్తిక సమాజం అధ్యక్షుడు జీడీ సారయ్య, మానవ హక్కుల వేదిక నాయకులు వి.ఎస్.కృష్ణ, ప్రొఫెసర్ ఎస్.సూరప్పుడు, దళిత ముక్తి ప్రతినిధులు బంకపల్లి అప్పారావు, బి.సన్యాసమ్మ, కె.కుమార్, యు.శివ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. దళిత ముక్తి 25 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం సందర్భంగా నగరంలో ర్యాలీ నిర్వహించారు.

ఐటీడీఏ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - అరకులోయ: అల్లూరి జిల్లా మన్యం పరిధిలో గల పాడేరు ఐటీడీఏ పరిధిలో ఉన్న పద్మాపురం గార్డెన్, మ్యూజియం, కొత్తవలస హెచ్ ఎన్‌టిసి, చింతపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం కార్మికులు ఎదుర్కొ ంటున్న న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆదివారం గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్ ఎదుట కార్మికులు విధులు బహిష్కరించి ఒకరోజు మెరుపు సమ్మె నిర్వహించారు. మెరుపు సమ్మె చేస్తున్న కార్మికులకు ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియ జేసింది. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ ఐటీడీఏ పద్మాపురం ఉద్యానవనం, గిరిజన మ్యూజియంలో కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్న కార్మికులకు పనికి తగ్గ కనీస వేతనాలు ఇవ్వడం లేదని, ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించ కపోవడం దుర్మార్గమన్నారు. ఐటీడీఏలో పరిధిలో పనిచేస్తున్న కార్మికులందరికీ కలెక్టర్ గెజిట్ జీవో ప్రకారం వేతనాలు చెల్లించా లన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు దాడి రాజు, దొంబు, నాయకులు రాంబాబు, బాబు, చిట్టిబాబు, తులసమ్మ, బురుంద, మాలతీ, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరామ అక్షింతలకు ఎగబడ్డ ప్రజలు

విశాలాంధ్ర - పద్మనాభం: విశాఖపట్నంలోని అంబికా బాగ్ రామాలయం నుండి స్థానిక ఎంపీపీ కే.రాంబాబు ఆధ్వర్యంలో పద్మనాభంలోని కుంతీ మాధవస్వామి ఆలయానికి తీసుకుని వచ్చిన అయోధ్య శ్రీరామ పూజ అక్షింతలు కలసానికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు. ఆలయ మొదటి ద్వారం నుంచే హారతి పట్టి కుంతి మాధవస్వామి ఆలయంలోకి ఊరేగింపుగా తీసుకొని వెళ్లారు. అనంతరం ఆలయంలో అక్షింతలు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మలయాళ లక్ష్మీ నరసింహ ఉత్తర పీఠాధిపతి పరమాత్మ ఆనంద గిరి స్వామి హాజరై మాట్లాడారు.

ఇటువంటి ధార్మిక కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని భగవంతుని ఆశీస్సులు పొందాలని సూచించారు. రాముడు జన్మించిన స్థలంలోనే రామ మందిర నిర్మాణం కళ ఐదు వందలు సంవత్సరాల తర్వాత సాకారం కావడం మన అందరి అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం సర్పంచ్ టి.పాప, పద్మ దంపతులు, ఎంపీటీసీ కె.లక్ష్మి, ఎర్రి నాయుడు దంపతులు, టి.పైడిరాజు, టి.నరసింహ నాయుడు, జి.పద్మనాభ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ సాధనకు ఉద్యమించాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: చేయి చేయి కలుపుదాం.....శిష్టకరణ ఓబీసీ సాధిద్దామని శిష్టకరణాల ఓబీసీ సాధన కమిటీ కన్వీనర్ ఎస్.గజపతి రావు పేర్కొన్నారు. కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ ఆధ్వర్యంలో దువ్వా దలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి మాట్లాడారు. కూర్మన్నపాలెం అసోసియేషన్ ఆధ్వ ర్యంలో విశేష కార్యక్రమాలు చేపడుతుండటం ఎంతో అభినందనీయమని, ఇతర శాఖలకు ఆదర్శనీయ మన్నారు. శిష్టకరణాలు ఐక్యంగా ఉండాలని, తద్వారా సమస్యలు పరిష్కారానికి వీలు వడుతు ందన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వ హించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కూర్మన్నపాలెం అసోసియేషన్ కార్యదర్శి డి.సత్యారావు, అధ్యక్షుడు గంగవరం గోపి, వివిధ సంఘాల ప్రతినిధులు మంత్రి శ్యామ్ ప్రసాద్, మంత్రి నరసింహామూర్తి, మంత్రి మోహన్రావు పట్నాయక్, డి.గురునాథం, ఉర్లం ప్రసాద్, శేఖరమంత్రి శ్రీనివాసరావు, పోట్నూరి నాగేంద్ర పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: ఈ నెల 21వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చింతపల్లి పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ పోలీసు, ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీ లించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు, ట్రాఫిక్ కు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, ముఖ్యమంత్రి భద్రతకు ఆటంకం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందులో భాగంగా హెలిప్యాడ్ నిర్మాణ, వేదిక, బారికేడ్ల ఏర్పాటు పనులు పరిశీలన చేసి సంబంధిత అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. సమయం తక్కువగా ఉన్నందున పనులు వేగవంతంగా చేయాలని ఆదేశించారు.

రౌడీ షీటర్లంతా సత్ప్రవర్తనతో మెలగాలి

టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టి వారిని కౌన్సెలింగ్ చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవి శంకర్ ఆదేశాల్లో భాగంగా అడిషనల్ కమిషనర్ నాగేంద్ర, స్పెషల్ బ్రాంచ్ ఆదేశాల మేరకు త్రినాథ్‌రావు, అసిస్టెంట్ కమీషనర్ అఫ్ పోలీస్, టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్ వారు టాస్క్ ఫోర్సు పోలీస్ స్టేషన్ లో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. విశాఖపట్నం సిటీ పరిధిలో ఉన్న జోన్ 1,2 పోలీస్ స్టేషన్‌ల పరిధి రౌడీ షీటర్లుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అందరు మంచి నడవడిక కలిగి వుండాలని, ఎవరు ఎటువంటి సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడరాదన్నారు.

పెన్షనర్ల సమస్యలపై పోరాటాలు చేయాలి

విశాలాంధ్ర - భీమిలి: కనీస పెన్షన్ 9000కు పెంచాలని, రైళ్లలో ప్రయా ణించడానికి సీనియర్ సిటిజన్స్‌కి ఇచ్చే సబ్సిడీని పునర్ధరించాలని, ఈఎస్ఐ హాస్పిటల్ ద్వారా హెల్త్ సౌకర్యం కల్పించాలని స్థానిక పెన్షనర్ల సంఘం అధ్యక్షులు అల్లు బాబురావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చిట్టివలస బంతాట మైదానం వద్ద జూట్ మిల్ కళ్యాణ మండపంలో పెన్షన్ పొందుతున్న రిటైర్మెంట్ కార్మికులు విస్తృత స్థాయి సమావేశంలో అల్లు బాబూరావు, రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షులు సుధాకర్ మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలపై విస్తృత పోరాటాలు చేయాలని అన్నారు. ఈనెల 20వ తేదీన రాస్తారోకో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్టి వలస లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండప్ప ఈశ్వరరావు, సీఐటయూ నాయకులు ఎస్.అప్పల నాయుడు, టీఎన్‌టీయూసీ నాయకులు ఎం.దేవుళ్ళు, ఏఐటీయూసీ నాయకులు కె.రాంబాబు, అమ్మ అప్పలరాజు, ఎం.వీర్రాజు, పెన్షనర్ల సంఘం నాయకుడు దామోదరం బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

చంద్ర రాజకుమారికి ఘన నివాళులు

విశాలాంధ్ర - పెందుర్తి: మహిళా మండలి నాయకురాలు స్వర్గీయ చంద్ర రాజకుమారికి ఏపీ మహిళా సమాఖ్య నాయకులు ఘన నివాళులర్పించారు. రాజకుమారి 5వ వర్ధంతి సందర్భంగా సుజాతనగర్ సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఉదయం మహిళా సమాఖ్య విశాఖ జిల్లా కార్యదర్శి బేగం, సభ్యులు పుష్ప, వాసుపల్లి లక్ష్మీ, నేటింటి పావని, కక్కల రజిని తదితరులు ఆమె చిత్ర పటానికి

పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా మహిళా సమాఖ్య నేతలు మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం రాజేశ్వరి ఎన్నో పోరాటాలు చేసి అండగా నిలిచారని పేర్కొన్నారు. మహిళలకు రాజకుమారి అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరహా లక్ష్మీనరసింహ స్వామి వారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మధరావు దంపతులు దర్శించుకున్నారు వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసుమూర్తి ఘనస్వాగతం పలికారు. అర్చక స్వాములు పూర్ణ కుంభంతో ఆహ్వానించారు. న్యాయమూర్తి కప్పస్తంభం ఆలింగనము స్వామి వారి దర్శనం చేసుకుని తమ గోత్ర నామాలతో సంకల్పం చేయించారు.

నేడు కుసులవాడలో లక్ష దీపోత్సవం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం కుసులవాడ గ్రామంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా లక్ష దీపోత్సవం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవ్ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం నుండి శివాలయంలో లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించి అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి భారీ అన్నదానం నిర్వహించ నున్నట్టు తెలిపారు. లక్ష దీపోత్సవ కార్యక్రమానికి భక్తులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

విశాలాంధ్ర - మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు 61వ వార్డులో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మల్కాపురం యాదవ్ సంఘం కమ్యూనిటీ హాల్ మార్గంలో జీడీపీ వర్క్‌లో భాగంగా రోడ్డు వేశారు. ఈ సందర్భంగా ఆ పనులను 61వ వార్డ్ కార్పొరేటర్ కొణతాల సుధా ఆదివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పిలక రామ్మోహన్ రెడ్డి, బూస అప్పల నాయుడు రెడ్డి, శంకర్ రెడ్డి, పూడి మల్లేష్, సిహెచ్ నూకరాజు, ఎన్‌వి రమణ, మంగ, వైసీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ మారథాన్‌లో ఏయూ ఉద్యోగులకు మెడల్స్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సంధ్య మెరైన్స్ ఆధ్వర్యంలో ఆదివారం బీచ్ రోడ్ లో నిర్వహించిన వైజాగ్ మారథాన్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు విజేతలుగా నిలిచారు. ఏయూ దూరవిద్య విభాగానికి చెందిన ఉద్యోగులు రాపాక శ్రీనివాస్ (10కే), తోనంగి రోహిత్ యాదవ్ (5కే) విభాగాలలో విజేతలుగా నిలిచి మెడల్స్ పొందారు.

కాంగ్రెస్‌తోనే అంగన్వాడీల సమస్యలకు పరిష్కారం

విశాలాంధ్ర - పెందుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆ పార్టీ జిల్లా నాయకులు స్పష్టం చేశారు. తమ సమస్యలు పరిష్కారం కోరుతూ పెందుర్తిలో సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు డీసీసీ జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు, పిసిసి జనరల్ సెక్రెటరీ జగత శ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఆదారి రమేష్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ షేక్ షఫీ ఉల్లా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మోజి లక్ష్మోజి, పెందుర్తి మండల పార్టీ ప్రెసిడెంట్ ముక్కు రాము నాయుడు, కిసాన్ సెల్ అధ్యక్షులు గండి సన్నీబాబు తదితరులు మద్దతు పలికారు. అంగ న్వాడీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న కాంగ్రెస్ నాయ కులు తమ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను అన్ని విధాలుగా మోసం చేశాయని మండిపడ్డారు. రోజంతా విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బందికి కనీస వేతనాలు, గ్రాట్యూటీ, పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రాడ్యుటీ, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

21న అపూర్వ సమ్మేళనం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ప్రైస్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్), దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన(డి.డి.యూ-జి.కె.వై) ద్వారా శిక్షణ పొందిన బహుళ జాతీయ కంపెనీల్లో అత్యున్నతమైన ఉద్యోగాలు పొందిన యువతతో విశాఖలో డిసెంబర్ 21న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఏపీ ప్రభుత్వ సలహాదారుడు (స్కిల్ ట్రైనింగ్ జాబ్ ఫెయిర్) గాది శ్రీధర్ రెడ్డి తెలిపారు. దీనిలో భాగంగానే సీడాప్ సి.ఈ.వో ఎం.కె.వి.శ్రీనివాసులుతో కలసి విశాఖ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చిల్డ్రన్స్ ఏరియాలో నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కలలను సాకారం చేయుటకు ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ ని సద్వినియోగం చేసుకుని ఆయా రంగాల్లో స్థిరపడటం హర్షనీయమన్నారు. అనంతరం సి.ఈ.వో ఎం.కె.వి. శ్రీనివాసులు మాట్లాడుతూ 2019 నుంచి 2024 ఆర్థిక సంవత్సరానికి 31 రంగాల్లో 66,125 మంది శిక్షణ పొందితే 44,749 మంది ఆయా రంగాల్లో స్థిరపడ్డారని వెల్లడించారు. అదేవిధంగా 2023-2024 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు 17,242 మంది శిక్షణ పొందితే 13,681 మంది 24 రంగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడ్యాప్ ఈ.డి.కె. శ్యాం ప్రసాద్, డి.ఆర్.డి.ఎ పి.డి ఎం.ఎస్.శోభారాణి, స్టేట్ మిషన్ మేనేజర్ ఎం. విజయ కుమార్ పాల్గొన్నారు.

20న యువగళం సభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - ఆనందపురం: టీడీపీ - జనసేన బలోపేతమే లక్ష్యంగా రానున్న ఎన్నికలలో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రతీ కార్యకర్త సైనికులు కష్టపడాలని ఆనందపురం మండల జనసేన పార్టీ అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు తెలిపారు. ఆదివారం వేములవలస జంక్షన్ జనసేన రూరల్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జరిగిన జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న జరిగే యువ గళం సభను విజ యవంతం చేసేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ తమ్మిన అప్పల రాజు, ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, ఉపాధ్యక్షులు తాడివాడ శివకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణ, కార్యదర్శులు డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు, నర్సింగరావు, ఆల్తిరాజు, సురేష్, రాంపల్లి సురేష్, తోమురోతు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కాజల్ అగర్వాల్‌తో సెంట్రమ్ నూతన క్యాంపెయిన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రపంచంలోనే నంబర్ 1 మల్టీ విటమిన్ బ్రాండ్ సెంట్రమ్, భారతదేశంలో తన కొత్త శ్రేణి మల్టీ విటమిన్, ప్రొటీన్‌ల శ్రేణిని విడుదల చేసేందుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నటి, ఎంటర్‌ప్ర్యూనర్ కాజల్ అగర్వాల్‌ను ప్రకటించింది. పలువురు భారతీయులకు వారి మొత్తం పోషకాహార అవసరాల గురించి తెలియకపోవచ్చు. నిజానికి, 10 మంది భారతీయులలో 8 మంది మల్టీవిటమిన్ లోపంతో సమస్యలు ఎదుర్కొంటూ ఉండేందుకు అవకాశం ఉండాలి. కాజల్‌తో కలిసి సెంట్రమ్ క్యాంపెయిన్ సమతుల్య ఆహారం ప్రాముఖ్యతను, పోషకాహార అంతరాలను భర్తీ చేసేందుకు ఆహారంతో పాటు మల్టీవిటమిన్‌లను చేర్చడాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది సెంట్రమ్ మద్దతుతో కాజల్ తన బహుళ పాత్రలను అంతరాయం లేకుండా నిర్వహించడాన్ని హైలైట్ చేస్తుందని హేలియన్ మార్కెటింగ్ హెడ్ అనురితా చోప్రా అన్నారు.

రాళ్లగెడ్డలో మహిళ మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - హుకుంపేట: మండల కేంద్రమైన హుకుంపేటలో గల రాళ్ల గెడ్డ వద్ద ఆదివారం మహిళ మృతదేహం లభ్యమైంది. పాడేరుకు చెందిన ఎం రవి (జీప్ మెకానిక్) భార్య దేవిగా గుర్తించినట్టు స్థానిక ఎస్ఐ తెలిపారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పూర్తిగా ఆరోగ్యం క్షీణించడంతో ఆమె మతిస్థిమితం సరిగ్గా లేక పోవడం వలన ఏడో తేదీ నుండి ఇంటి నుండి బయటకు వెళ్లిపోయిందని అప్పటినుంచి ఆమె భర్త వెతుకులాట ప్రారంభిం చారని ఎస్ఐ తెలిపారు.

దీంతో పాడేరు పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారన్నారు. అయితే ఆదివారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రం సమీపంలో గల రాళ్ల గెడ్డ వద్ద శవమై కనిపించింది.

స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పంచనామా నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టీడీపీతోనే నిరుద్యోగులకు న్యాయం

విశాలాంధ్ర - పెందుర్తి: రాష్ట్రంలో నిరుద్యోగులకు జగన్ ప్రభుత్వంలో తీవ్ర అన్యాయం జరిగిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కు నిరుద్యోగులు తమ గోడును తెలియజేశారు. పెందుర్తి నియోజకవర్గం గొర్లవానిపాలెం జిజె కాలేజి వద్ద బోనంగి, లెమర్తి, తాడి, తానం గ్రామాల నిరుద్యోగ యువకులు యువనేత లోకేష్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. యువతకు ఉద్యోగాలివ్వడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని తూర్పారబడుతూ ప్లకార్డులు చేతబూనారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువకులు లోకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. మా ప్రాంతంలో రాంకీ వారి నేతృత్వంలో జవహర్ లాల్ నెహ్రూ ఫార్మాసిటీ ఏర్పాటు చేశారు. ఫార్మాసిటీలో మా ప్రాంతంలో నిర్వాసితులకు ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వడం లేదు. మా సమస్యను కలెక్టర్, ఇతర అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. భూములు కోల్పోయిన నిర్వాసితులు ఆర్థిక సమస్యలతో సతమతమ వుతున్నారని చెప్పారు. మీరు అధికారంలోకి వచ్చాక ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. నిర్వాసితుల్లో చదువుకున్నవారికి శిక్షణ ఇచ్చి ఫార్మా కంపెనీల్లో శాశ్వత ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, తాడి గ్రామం ఫార్మాసిటీని ఆనుకుని ఉంది. కాలుష్య కోరల్లో మా గ్రామం చిక్కుకుని ఇబ్బందులు ఎదుర్కొం టోందన్నారు. అనంతరం లోకేష్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో యువత భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని అన్నారు. ఉద్యోగాలు వచ్చేవరకు యువగళం నిధి కింద నెలకు రూ.3వేల చొప్పున భృతి ఇస్తాం చెప్పారు.

108 అంబులెన్స్‌లకు సుస్తి

విశాలాంధ్ర - చింతపల్లి : - అల్లూరి ఏజెన్సీలో అంతంత మాత్రంగా వైద్య సేవలు అందిస్తున్న 108 అంబులెన్స్ లు మరమ్మత్తులకు గురై మూలకు చేరాయి. గత ప్రభుత్వ హయాంలో మన్యంలో వైద్య సేవలు సక్రమంగా అందించే దిశగా తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. గడచిన రెండేళ్లుగా రెండు 108 అంబులెన్స్ వాహనాలు మరమ్మత్తులకు గురై నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మరమ్మతులకు గురైన 108 వాహనాలను మరమ్మత్తులు చేపట్టి వినియోగిస్తే అత్యవసర సమయాలలో గిరి గ్రామాల రోగులను ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించేందుకు ఉపయోగం ఉంటుంది. రహదారి ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రులను, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులను మండల కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి తరలించేందుకు ఒక 108 అంబులెన్స్ మాత్రమే ఉండటం వలన అత్యవసర సమయాలలో అందుబాటులోకి రాని దుస్థితి నెలకొంది. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులకు గురైన 108 అంబులెన్స్ వాహనాలను మరమ్మత్తు పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బాబు వస్తే భావితరాలకు భరోసా

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: బాబు వస్తే భావితరాలకు భరోసా అని 87వ వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం (జగన్) అన్నారు. వడ్లపూడి శెట్టి బలిజ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టి పరిపాలన చేస్తున్నారని, యువతకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమయ్యారని, బాబు వస్తేనే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు రాజన్ రాజ్, జిల్లా కార్యదర్శిలు కర్రి కన్నారావు, సిరసపల్లి బాబురావు, ద్రోణాద్రి అప్పల నాయుడు, జీవి రమణ, చొప్ప నూకరాజు, గండిమాన కనకరాజు, యాబోజి భాస్కరరావు పాల్గొన్నారు.

ఇసుజు ఐ-కేర్ శీతాకాల శిబిరం ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఇసుజు మోటర్స్ ఇండియా, తమ వార్షిక ఇసుజు ఐ - కేర్ వింటర్ సర్వీస్ క్యాంప్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఇది ఇసుజు డి - మాక్స్ పికప్, ఎస్‌యూవీల శ్రేణిలో కస్టమర్‌లకు ఆకర్ష ణీయమైన ప్రయోజనాలను, నివారణ నిర్వహణ తనిఖీలను అందిస్తుంది. ఇసుజు సర్వీస్ వద్ద 'కేరింగ్ నెవర్ స్టాప్స్' ఈ శీతాకాలంలో ఇసుజు కస్టమర్‌లకు చురుకైన సేవ, యాజమాన్య అనుభవాన్ని అందించాలనే దాని నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. 'ఇసుజు కేర్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఈ శీతాకాలపు శిబిరాన్ని అన్ని ఇసుజు అధీకృత డీలర్ సర్వీస్ అవుట్‌లెట్‌లలో 18 నుండి 23 తేదీల్లో నిర్వహించబడుతుంది.

కొప్పిశెట్టి మురళీకృష్ణకు 'లీడర్‌షిప్ ఇన్ ఎక్సలెన్సీ-2023' అవార్డు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: డైరెక్ట్ సెల్లింగ్‌లో అత్యంత ప్రతిభ కనబరుస్తున్న విశాఖలోని గాజువాకకు చెందిన కొప్పిశెట్టి మురళీకృష్ణకు మరో అవార్డు వరించింది. దేశ, విదేశాల్లో ఇప్పటికే అనేక పురస్కారాలు సాధించిన ఆయనకు తాజాగా 'లీడర్‌షిప్ ఇన్ ఎక్సలెన్సీ-2023' అవార్డు లభించింది. నేషనల్ ఎంట్రపెన్యూ ర్‌షిప్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ ఇన్ డైరెక్ట్ సెల్లింగ్-2023' పేరిట దిర్బెంజా బైతుంగా (నవీ ముంబయి)లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో గురువారం మురళీకృష్ణ ఈ అవార్డు అందుకున్నారు. 'నెట్‌వర్క్ ఎక్స్‌ప్రెస్' సమర్పణలో జరిగిన ఆ కార్యక్రమంలో మోడరేటర్, చాట్ విత్ ఫౌండర్ సురేందర్ వాట్స్ చేతుల మీదుగా మురళీ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కెంగెన్ వాటర్ ప్యూరిఫైర్ బ్రాండ్‌ను డైరెక్ట్ సెల్లింగ్‌లో మురళీ అనేక మంది మన్ననలు పొందిన సంగతి తెలిసిందే.

ఆగ్నేయాసియాకి అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ విస్తరణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నిర్మాణ సామగ్రి తయారీదారు అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, దాని యూపీవీసీ డోర్స్, విండోస్ బ్రాండ్, ఓకోటెక్‌తో వ్యూహాత్మకంగా ఆగ్నేయాసియా మార్కెట్‌లలోకి ప్రవేశించింది. ఉత్తర భారత మార్కెట్ భూటాన్‌లోకి విజయవంతంగా ప్రవేశించిన తర్వాత, వియత్నాం, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్‌లోకి అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ ప్రవేశించటంతో భవిష్యత్తులో ఓకోటెక్ యొక్క మొత్తం ఆదాయానికి 20 శాతం సహకరించవచ్చు. యూపీవీసీ విభాగం విస్తరణను సులభతరం చేయడానికి, అపర్ణ ఎంట ర్‌ప్రైజెస్ 50 కోట్ల రూపాయలను కేటాయించిందని అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అపర్ణ రెడ్డి, అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ యొక్క యూపీవీసీ డివిజన్ ప్రెసిడెంట్, సీఈఓ మహేష్ చౌదరి విస్తరణ వివరాలు వెల్లడించారు.

నారా లోకేష్ యుగళం పాదయాత్రకు తరలిరండి

విశాలాంధ్ర - చింతూరు: నారా లోకేష్ యువగళం ముగింపు సభకు విలీన మండలాల నుండి అత్యధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు తరలిరావాని తెలుగుదేశం పార్టీ రంపచోడవరం ఇంచార్జ్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం చింతూరులో మండలాధ్యక్షుడు స్వగృహంలో జరిగిన సమా వేశంలో బాబు షూరిటీ- భవిష్యత్ గ్యారంటీ రివ్యూ సమావేశంలో రంపచోడవరం నియోజకవర్గ ఇన్చార్జ్ వంతల రాజేశ్వరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చింతూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇలా చిన్నారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ ఓబులేని నరసింహారావు, కూనవరం మండల అధ్యక్షులు బరపాటి ప్రకాష్, క్లస్టర్ ఇంచార్జ్ ఎడవల్లి భాస్కరరావు, ఎటపాక మండల అధ్యక్షులు పుట్టి రమేష్, క్లస్టర్ ఇంచార్జ్ మాచినేని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సోములకు ఘన సత్కారం

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ నందవరపు సోములు అన్నారు.

విశాఖ దాబా గార్డెన్, నెల్లూరు మెస్ వద్ద మహానటుడు అందాల కథానాయకుడు నటభూషణ శోభన్ బాబు కాంస్య విగ్రహావిష్కరణ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నందవరపు సోములు పాల్గొన్నారు. తొలుత సోములు శోభన్ బాబు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విశాఖ సిటీ వైడ్ ఫ్యాన్స్ వారు నందవరపు సోములును సత్కరించారు ఈ కార్యక్రమంలో శోభన్ బాబు సేవా సంఘం ప్రధాన కార్యదర్శి గోరకల రామదాసు, గౌరవ అధ్యక్షులు చందు సుబ్బారావు, ఉపాధ్యక్షులు బండారు త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - జీకేవీధి: ఈ నెల 21 తేదీన చింతపల్లిలో జరిగే ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని జీకేవీధి జెడ్పీటీసీ కిముడు శివరత్నం కోరారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారని, అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో పాల్గంటారన్నారు. కావున మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - జీకేవీధి: జీకేవీధి మండలం రింతాడ పంచాయతీ మాలివీధిలో ఆదివారం సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సర్పంచ్ బి.లక్ష్మీ మాట్లాడుతూ రూ.5లక్షల నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ కె.ధనలక్ష్మీ, వైసిపి నాయకులు బి.వెంకటరావు, కె.గోపి, కె.మోహనరావు పాల్గొన్నారు.

18న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మీ ముఖ్య సమావేశం

విశాలాంధ్ర - జీకేవీధి: ఈ నెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి చింతపల్లి పర్యటన నేపథ్యంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మీ జీకేవీధిలో సమావేశం నిర్వహించనున్నారని వైసిపి మండల అధ్యక్షులు టబ్బిలి లక్ష్మణ్‌తెలిపారు. ఈ సమావేశంకు ఎంపిపి, జెడ్పీటీసీ, వైస్ ఎంపిపిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలి

విశాలాంధ్ర - మల్కాపురం: హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం 59వ వార్డు గాజువాక డిపో ఆంజనేయస్వామి ఆలయానికి ఎదురుగా గల సామాజిక భవనంలో నిర్వ హించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు బోగవెల్లి నాగభూషణం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసీపీ పశ్చిమ నియోజ కవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకులు మంత్రి రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించడంలో సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్‌టియు కే.బద్రీనాథ్, స్థానిక పరిశ్రమల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్, సైల్, బి. హెచ్. పి వి, ,హెచ్. ఎస్. ఎల్, ఆర్. టీ. సి, హెచ్. జడ్. ఎస్, డ్యూ. ఎస్. ఐ వంటి , ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి రిటైర్ అయిన కార్మికులు 1038 వ రోజు దీక్షలో పాల్గొన్నారు. అనంతరం కే దీనబంధు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు పెన్షనర్స్ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగాలని వారి బలమైన ఆకాంక్షను తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, దొమ్మే ప్పురావు, శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు తల్లులు మద్దతు

విశాలాంధ్ర - చోడవరం: మండలంలోని లక్కవరం గ్రామంలో తల్లులు అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. మాతా శిశు సంరక్షణ కోసం సమగ్ర శిశు సంరక్షణ అభివృద్ధి పథకం క్రింద అంగన్వాడీ కార్యకర్తలు సిబ్బంది యేళ్ల తరబడి పని చేస్తున్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలు తలుపులు పగలగొట్టి, మహిళా వాలంటీర్స్ సచివాలయం సిబ్బందితో నడపాలి అనుకోవడం నిరంకుశత్వం అని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు నియమిత సిబ్బందితోనే నిర్వహించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలంలో సొంత్యాం లైన్ మెయింటెనెన్స్ కారణంగా సోమవారం ఉదయం 8.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని విద్యుత్ శాఖ ఏఈ సురేష్ కుమార్ తెలిపారు. ఈ కారణంగా గండిగుండం, రామవరం, జి.యస్. అగ్రహారం, మామిడిలోవ తదితర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

లక్కవరంలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - చోడవరం: మండలంలోని లక్కవరం జెడ్.పి. హైస్కూల్లో యువ సేవ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వ ర్యంలో శంకర్ ఫౌండేషన్ పర్యవేక్షణలో ఆది వారం ఉచిత వైద్య శిబిరం నిర్వ హించారు. ఈ శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 20 మందికి ఆపరేషన్ నిమిత్తం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ హాస్పిటల్‌కి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శీరంరెడ్డి వెంకట రమణ (శ్రీను), వైద్య సిబ్బంది, హెల్పింగ్ హేండ్స్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరుకూటి చందుకు ఘన సన్మానం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: వైసీపీ గాజువాక ఇన్చార్జిగా నియమితులైన ఉరుకూటి రామచంద్రరావును జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో గల కణితి రామాలయంలో కనితి కళింగ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళింగ యూత్ ప్రతినిధులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ శాతవాహనలో జాబ్ మేళా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నంలో మాజీ సైనికుల కోసం ఐఎన్ఎస్ శాతవాహనలో జాబ్ మేళా నిర్వహించారు. డెరెక్టరేట్ జనరల్ ఆఫ్ రీసెటిల్‌మెంట్, మాజీ సైనికుల సంక్షేమ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఆంధ్ర ప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల మాజీ సైనికుల నుండి విశేష స్పందన లభించింది. జాబ్ మేళాలో 30 కంపెనీలు పాల్గొన్నాయి. సైన్యం, వైమానిక దళం, నౌకాదళం నుండి దాదాపు 1340 మంది మాజీ సైనికులు ఉపాధి కోసం నమోదు చేసుకున్నారు. ఈ జాబ్ మేళాను డైరెక్టర్ రీజనల్ సెంటర్ కమోడోర్ వివేక్ హెహాట్టి, శ్రీనివాసరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో రోహిత్ మెహతా, తదితరులు పాల్గొన్నారు.

గింజంగిలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - జీకేవీధి : జీకేవీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ గింజంగి గ్రామంలో ఆదివారం ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో జీకేవీధి మండల మన్యసీమ (అరుణా తారా) రైతు సంఘం సహాయసహకారాలతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 92 మంది రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో అరుణా తారా రైతు సంఘం (కో-ఆర్డీ-నేషన్) సభ్యులు ఎం.భూపతి, వి.విష్ణుమూర్తి, వీరయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి పునర్జీవనం కోసమే 'జాతీయ రేలా పండూం'

విశాలాంధ్ర - చింతూరు : ఆదివాసి పునర్జీవనం కోసమే జాతీయ 5వ రేలా పండూం చింతూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగిందని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడే మురళి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి చోడే మురళి మాట్లాడుతూ.. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చింతూరు మండల కేంద్రంలో ఆదివాసి కళాకారులచే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎస్ఎంహెచ్ హాస్టల్ నుండి ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల వరకు కళాజాత నిర్వహించడం జరిగిందన్నారు. సర్వం కోల్పోయిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం కటాఫ్ డేట్ తో సంబంధం లేకుండా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కుటుంబంగా పరిగణించి నష్టపరిహారం చెల్లించాలని మరియు పోలవరం ప్రాజెక్టులో ఏపీ జెన్కోలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, శాస్త్రీయ సమగ్ర పునరావాసం కల్పించాలని, కాంటూరు 41.15 లెవల్లో పోలవరం నిర్వాసితులకు భూమికి భూమి,ఇల్లుకి ఇల్లు ఇచ్చి నష్టపరిహారం చెల్లించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. కనిపించి కనపడ కుండా ఉన్న కోయ భాష పరిరక్షణ కోసం ఆదివాసీ సంక్షేమ పరిషత్ మరియు కోయత్తోర్ బాట ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలు నుండి కోయ భాష పరిరక్షణ కోసం కోయ బాల సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావడం కోసం మరియు ఆదివాసి సంస్కృతి పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తుం దన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో షెడ్యూల్డ్ ప్రాంతంలో 29 శాఖలలో ఉన్న 100 శాతం ఉద్యోగాలన్ని ఆదివాసీ పట్టభద్రులు తో భర్తీ చేయాలని పోరాడి సాధించిన జీవో నెంబర్ 3 ఫలితమే అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్న ఐటీడీఏ పరిధిలో ప్రత్యేక డీయస్సి లలో కోయ భాష పండిట్లకు కూడా ప్రత్యేక స్థానం కల్పించి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలాగే 2024 ఫిబ్రవరి 9,10,11 తేదీలలో అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజక వర్గం చింతూరు మండల కేంద్రంలో జాతీయ స్థాయిలో ఆదివాసి సాంస్కృతిక సమ్మేళనం 5వ రేలా పండూం మరియు సెమినార్ ను మూడు రోజులు పాటు నిర్వహించడం జరుగు తుందన్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆదివాసి హక్కులు చట్టాలు జీవోలు,కోయ బాల సాహిత్యం,ఆదివాసీ సంస్కృతి, భారత రాజ్యాంగం అనే అంశాలపై సెమినార్ నిర్వహించడం జరుగు తుందన్నారు. అనంతరం సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు వివిధ రాష్ట్రాల ఆదివాసి కళాకారులచే ఆదివాసి సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించడం జరుగు తుందన్నారు. జాతీయ స్థాయిలో జరిగే ఐదవ రేల పండుకు వచ్చే ఆదివాసి మేధావులు, ఉద్యోగులు, కవులు, గాయకులు, కళాకారులు, రచయితలు, సాహితీ వేత్తలు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువతి యువ కులు, విద్యార్థులు అందరూ ముందుగా తమ పేర్లను ఈ కింది సెల్ నెంబర్లకు 96420 67386 లేదా 95739 46097 లను సంప్రదించి నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కారం రవి, కారం రాము, పొడియం లక్ష్మణ రావు,కొంద్రు వెంకట లక్ష్మీ మరియు ఆదివాసీ విద్యార్థులు పాల్గొన్నారు.

వేదమంత్రాలలో ఆధ్యాత్మిక రహస్యాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి

ఆర్డీవో హెచ్‌వి జయరాం

విశాలాంధ్ర - నర్సీపట్నం : వేదమంత్రాల్లో ఉన్న ఆధ్యాత్మిక రహస్యాలను ప్రతి ఒక్కరు క్షుణ్ణంగా తెలుసుకొని దాని కనుగుణంగా జీవితాలను మలుచుకోవాలని నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి హెచ్‌వి జయరాం అన్నారు. ఆదివారం స్థానిక శారద నగర్‌లోని నవనిర్మాణ సమితి కార్యాలయంలో వేద మంత్రాలలో ఆధ్యాత్మిక రహస్యాలు వేద సాహిత్య పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదాలకు స్వామి వివేకానంద పెట్టింది పేరు అని వేద పారాయణ చేయాలని ఆయన ఈనాడు పిలుపునిచ్చారని కానీ నేటి యువత దానికి విరుద్ధంగా ఉందన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఉండాలన్నారు. వేద సాహిత్యం కోసం తెలుసుకోకపోతే జీవితం అగామ్య గోచరంగా మారుతుంది అన్నారు. ప్రస్తుత రోజుల్లో ఆధ్యాత్మికత భావాల మీద వేద సాహిత్యం మీద పుస్తకాలు వచ్చాయని వాటిని ప్రతి ఒక్కరు క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. 50 నుంచి 60 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు దీనికోసం తెలుసుకొని నేటి తరం యువతకు అనవసర విషయాల జోలికి పోకుండా వివరించవలసిన బాధ్యత ఉందన్నారు. చిన్నతనం నుంచే పెద్ద బాలశిక్ష వంటి పుస్తకాలను పిల్లలకు సదించడంతో పాటు వేదాల మీద కూడా సంపూర్ణ అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపు నిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గండి సింహాద్రి, ఓం శాంతి టీం భాస్కరరావు, శంకర్ మాస్టారు, యుఎస్‌వి సుబ్బయ్య, అధిక సంఖ్యలో మహిళలు పిల్లలు యువకులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

విశాలాంధ్ర - భీమిలి : భీమునిపట్నం మండలం తాళ్లవలస పంచాయతీలో ఉన్న నారాయణ స్కూల్ లో 9వ తరగతి చదువుతున్న ఆలుమూరి. శశికిరణ్ (15) స్కూల్ ఆవరణలో శనివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. కొన ఊపిరితో ఉన్న శశికిరణ్ ను నారాయణ స్కూల్ యాజమాన్యం స్థానిక ఎస్ఆర్ఐ హాస్పిటల్ కి తరలించారు. డాక్టర్లు పరీక్షించగా అప్పటికే మరణించాడు అని చెప్పడంతో యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు విషయం తెలియజేశారు. విద్యార్థి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా మెలియాపుట్టి మండలం జాడుపల్లి గ్రామం.విద్యార్థి తండ్రి గణేష్ మాట్లా డుతూ.. తన కొడుకు ఆత్మహత్య చేసుకోనంత పిరికివాడు కాదని యాజమాన్య నిర్లక్ష్యం వల్లే నా కొడుకు మరణించాడని ఆరో పించారు. నా కొడుకు మరణం పై అను మానాలు ఉన్నాయ న్నారు. అనంతరం నారాయణ విద్యాసంస్థల ఎదుట ధర్నా చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ.డి. రమేష్ తెలిపారు.

ఐక్య ఉద్యమాలతో హక్కులు సాధించుకోవాలి

విశాలాంధ్ర - కూనవరం : ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించినప్పుడు ఐక్య ఉద్యమాలతో హక్కులు సాధించుకోవాలని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణా అధ్యక్షుడు కారం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కోతులగుట్ట వద్ద అసోసియేషన్ మహాసభ జరిగింది. రాష్ట్ర వర్కింగ్ కమిటీ ఎన్నిక జరిగింది. టి. జోగారావు అధ్యక్షులుగా, పూసం వెంకటేశ్వర రావు ప్రధాన కార్యదర్శిగా, శ్రీమతి ఎం.సువర్ణ, సి.హెచ్. బాబురావులు ఉపాధ్యక్షులుగా, ఎస్.సంజీవరావు, జీ.గోవిందరావు లు కార్యదర్శులుగా, గుజ్జా సీతమ్మ, వై.రాజారావులు జాయింట్ సెక్రెటరీలుగా, కే.అర్జున్ కోశాధికారిగా, మడకం రమేష్ సహాయ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 3 రద్దయినప్పటికీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఏజెన్సీ ప్రాంత ప్రత్యేక ఉద్యోగ భద్రత విషయంలో 68 రద్దుకాలేదని పూర్తి స్థాయిలో అమలు చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని కానీ ప్రభుత్వాలు ఇదే వంకతో కావాలనే 68 అమలు చేయకుండా ఉల్లంగిస్తోందని ఐక్యంగా ఉద్యమాలు చేసి మన హక్కులను సాధించుకోవాల్సిన భాధ్యతమాత్రం మనపైనే ఉందని అన్నారు. అలానే మన డిపార్ట్మెంట్‌లో శాఖా పరమైన సమస్యలు, ప్రమోషన్లు, విధినిర్వహణలో ఎదురౌతున్న సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమం ఒక్కటే మార్గమని అందుకే మనం సంఘటితం కావాలని త్వరలోనే రెండు తెలుగు రాష్ట్రాల ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఉమ్మడి 68 అమలుకోసం భారీ సమావేశం ఏర్పాటు చేసి ఐక్య ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవశ్యకత ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, ఎన్. హెచ్. ఎం. మరియు ఆశ కార్యకర్తలు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనవరి ఒకటి నుండి లైఫ్ సర్టిఫికెట్స్ ఇవ్వాలి

విశాలాంధ్ర - మాకవరపాలెం : మండలంలోని పెన్షన్ దారు లంతా సంఘ ములను ఏర్పాటు చేసు కొని సభ్యులు అందరూ కలిసి జనవరి ఒకటి నుండి లైఫ్ సర్టిఫికెట్స్ ట్రెజరీకి ఇవ్వాలని నర్సీపట్నం ఎస్ టీఓ.సిహెచ్ గణేష్ అన్నారు. పెన్షన్ దార్లు సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా పెన్షన్ దారులు దినోత్స వంలో పాల్గొన్నారు. గణేష్ మాట్లాడుతూ దేశంలో పెన్షన్ పొందుతున్న మంటే నకార గారు కృషి ఫలితమే అన్నారు. సంఘ ఉపాధ్యక్షులు అచ్చీశ్వరరావు మాట్లాడుతూ సంఘ పటిష్టతకు అందరూ కృషి చేయాలని అన్నారు రిటైర్డ్ మండల విద్యాశాఖ అధికారి వానపల్లి నూకరాజు మాట్లాడుతూ సంఘం ఐక మత్యంతో పని చేసినప్పుడు మన సమస్యలు పరిష్కరించుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పి.రంగరాజు కోశాధికారి ఎం.వెంకటరాజు ఎం.శేషగిరిరావు, కే.కృష్ణ,ఆర్ రమణ, కే.లచ్చారావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి వితరణ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతా రామరాజు జిల్లా మండలంలోని సీతంపేట గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇటీవల సంభవించిన అగ్ని ప్రమా దంలో ఇల్లు పూర్తిగా దగ్ధమై సర్వం కోల్పో యిన ముత్యాల చిన్న వెంకటేశ్వర్లు కుటుంబానికి శ్రీకృష్ణార్జున ఫౌండేషన్' అధ్యక్షుడు కాకునూరు కృష్ణార్జున రావు' బియ్యం దుప్పట్లు, నూనె, బకెట్, కూరగాయలు నిత్య వసర వస్తువులు ఆదివారం వితరణగా అందించారు. ఈ కార్య క్రమంలో నోముల శ్రీనివాస్ రావు, బాగుల శ్రీనివాసరావు, చిచ్చడి రామారావు గారు, గేద శ్రీనివాసరావు, గొల్ల వెంకన్న పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం

విశాలాంధ్ర - నర్సీపట్నం : స్థానిక గ్రంథాలయంలో 'చదవడం మా కిష్టం "కార్యక్రమం గ్రంథాల యధికారిణి పి.దమ యంతి ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఉమెన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ భవాని పిల్లలకు నీతి కథలను చదివించారు. పిల్లలు అందరూ చదివిన తరువాత, అందులోని నీతిని వివరించారు. మాస్ రీడింగ్ ప్రోగ్రామ్‌లో పిల్లలు ఉత్సాహంగ పాల్గొన్నారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్ నిర్వహించి, స్కిల్ డెవలప్మెంట్ ప్రాముఖ్యత ను వివరించారు.

వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో

విశాలాంధ్ర - గోపాలపట్నం : ఈనెల 23వ తేదీన జరునున్న శ్రీ వరహాలక్ష్మీనరసింహ స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాట్లపై ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాస్ మూర్తి ఆధ్వర్యంలో భీమిలి ఆర్డిఓ భాస్కర్ రెడ్డి ఎమ్మార్వో రమణయ్య ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు బృందం ఉత్తర ద్వార దర్శనం ఏరియా పరిశీలించారు. క్యూ లైన్లు, విఐపి ప్రోటోకాల్ దర్శనాలు, వివిధ అంశాలపై చర్చించి తగు సూచనలు ఇంజనీరింగ్ విభాగం వారికి తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర - మాకవరపాలెం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991- 92 ఏడాదిలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలిసారు. అనంతరం వీరంతా మాకవరపాలెం మండలం కామేశ్వరమ్మ గుడి వద్ద గెట్ టుగెదర్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు అంతేకాకుండా చిన్ననాటి గుర్తులు నెమరు వేసుకుంటూ ఒకరికొకరు జాగోచేయమాలు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు ఉత్సాహంగా గడిపారు.

అనూష దేవికి ఆత్మీయ సత్కారం

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ మీరా

విశాలాంధ్ర - చింతపల్లి : వైకాపా మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన చింతపల్లి ఎంపీపీ కోరాబు అనుషా దేవికి ఆత్మీయ సత్కారం చేయడం ఆనందంగా ఉందని స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా అన్నారు. స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత ఎంపీటీసీ సభ్యులు దాసరి ధారలక్ష్మి, చిందాడ జయలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి లతో కలసి అనూష దేవిని దుస్సాలువతో సత్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో శ్రమించిన వారిని గుర్తించే తత్వం ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలు అందించడంలో రాజకీయ పార్టీలకతీతంగా లబ్ధిదారులకు ఏ విధంగా పథకాలు చేరుతున్నాయో, అదేవిధంగా పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతుందని, అందుకు ఉదాహరణ గా చిన్న వయసులోనే ఎంపీపీ కావడంతో పాటు రాష్ట్రస్థాయిలో మహిళా విభాగానికి కార్యదర్శిగా నియమితులు కావడం అనూష దేవి పనితనానికి వైకాపా ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపుగా వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికై పర్యవేక్షణ

విశాలాంధ్ర - రావికమతం : బియన్ రోడ్డు విస్తరణ లో భాగంగా ఆదివారం కొత్తకోటలో ప్రభుత్వ విప్ మరియు గౌరవ శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ పర్యవేక్షణ జరిగింది 1300 మీటర్ల మేర సిమెంట్ రోడ్డు అనగా కిలోమీటర్ పావు. సిమెంట్ రోడ్డు వేయుటకు నిర్ణయం జరిగింది. మొత్తం రోడ్డు 60 అడుగులు అనగా అటు 30 ఇటు 30 అడుగులు రోడ్డు నిర్మాణం చేపట్టాలని. ఆర్ అండ్ బి అధికారులు. కాంట్రాక్టర్. మరియు కొత్తకోట గ్రామ పెద్దలు మధ్య నిర్ణయం జరిగింది. ఇంత వరకు రోడ్డుకి ఇరు పక్కల ఉపాధి పొందుతున్న నాయి బ్రాహ్మణులు పువ్వుల షాపులు. కూరగాయల షాపులు. చెప్పులు కుట్టే వాళ్ళు ల అనేక మంది నిరాశ్రయులయ్యారు. ఈ విషయాన్ని గమ నించిన స్థానిక సీనియర్ నాయకులు గుమ్మడు సత్యదేవ. శాసన సభ్యులకు విపులంగా కొంత వివరణ ఇవ్వడం జరిగింది గ్రామంలో మండల పరిషత్ ఆధీనంలో ఉన్న రెండు ఎకరముల 80 సెంట్లు స్థలమును రవి థియేటర్ దగ్గర ఉన్న 46 సెంట్లు మరియు ఇంతకుముందే పాడుబడిన షాపింగ్ కాంప్లెక్స్. ఇవన్నీ కలిపి పంచాయతీ తీర్మానం చేసి. మండల తీర్మానం జిల్లా పరిషత్ తీర్మానం పంపి రాష్ట్ర ప్రభుత్వం నుండి జీవోను ఏర్పాటు చేసి.. దీనిని పంచాయతీ పాలకవర్గం దగ్గర హక్కులు కలిగి ఉండేలా ఏర్పాటు చేయాలని చెబుతూ. ఇప్పటికే శాసనసభ్యులు ధర్మ శ్రీ ఆదేశాలతో నాబార్డ్ ద్వారా రెండు కోట్ల రూపాయలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఉన్న వాటిని నిరాశ్రయులైన వారికి అద్దెకి ఇచ్చి ఆ వచ్చిన అద్దెలతో ఏ నెలకు ఆనెల పారిశుద్ధ కార్మికులకు జీతాలు చెల్లింపు చేయొచ్చని అన్ని రకంగా వెసులుబాటు అయ్యే విధంగా ఉంటుందని ఎమ్మెల్యేకి వివరించడం జరిగింది దీనికి శాసనసభ్యులు ఆమోదం తెలియజేశారు. ఈ పర్యవేక్షణలో భాగంగా గ్రామ సీనియర్ నాయకులు గుమ్మడి సత్యదేవ సర్పంచ్ కోన లోవరాజు ఉప సర్పంచ్ పందల దేవా ఎంపీటీసీ సభ్యులు పూడి దేవా వార్డు మెంబర్లు కొసిరెడ్డి శివాజీ పూడి నాగరాజు కోట మహేష్ మళ్ళీ చిరంజీవి కొసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు తెదేపా అండగా ఉంటుంది

తెదేపా అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానేశ్వరి

విశాలాంధ్ర - చింతపల్లి : తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై గడచిన ఐదు రోజులుగా నిరవధిక నిరసన కార్యక్రమాలు నిర్వ హిస్తున్న అంగన్వాడీలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ అరకు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి అన్నారు. ఆమె ఆ పార్టీకి చెందిన మరో మహిళా నాయకురాలు కోరాబు స్వర్ణతో కలిసి అంగన్వాడీలకు సంఘీభావంగా నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్వాడీలకు అన్ని విధాల న్యాయం చేస్తామని నమ్మబలికి నేడు ఆ హామీలను గాలికి వదిలేసారన్నారు. అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై రాష్ట్రవ్యాప్తంగా నిరసన దీక్షలు చేపట్టినప్పటికీ అధికార వైకాపా ఏమీ పట్టనట్లు వ్యవహరించడం ఆ ప్రభుత్వ నియంతృత్వ విధానానికి నిదర్శనమని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడేరు అభ్యర్థిగా గిడ్డి ఈశ్వరి పేరు ఖరారయిందని ప్రకటించడం హర్షనీయం

తెదేపా అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగభూషణం

విశాలాంధ్ర - చింతపల్లి : తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ అభ్యర్థిగా గిడ్డి ఈశ్వరి పేరు దాదాపు ఖరారు. చేయడం జరిగిందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రకటించడం హర్షనీయమని ఆ పార్టీ అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మాజీ శాసన సభ్యురాలుగా, ప్రస్తుత తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న గిడ్డి ఈశ్వరి పాడేరు నియోజకవర్గంలో తెదేపా బలోపేతానికై అహర్నిశలు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి తెలిసిందే అన్నారు. ఈ క్రమంలో పార్టీలో టిక్కెట్ ఆశిస్తున్న పలువురు నేతలంతా తమకే టిక్కెట్ వస్తుందని చెప్పుకుంటున్న తరుణంలో అయోమయ పరిస్థితిలో ఉన్న పార్టీ శ్రేణులకు ఆదివారం పాడేరు వచ్చిన మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాడేరు నియోజకవర్గ టికెట్ గిడ్డి ఈశ్వరికి దాదాపు ఖరారయిందని, పార్టీ శ్రేణులంతా ఆమె విజయానికి కృషి చేయాలని ప్రకటించడంతో పార్టీ శ్రేణులలో హర్షాతిరేఖాలు వెల్లి విరిశాయన్నారు. ఈ ప్రకటనతో పార్టీ శ్రేణులంతా గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా సమిష్టిగా కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆనంద్ బాబు సూచించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరికి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు.

భారతీయ కళా సంస్కృతులను ప్రదర్శించిన వార్షికోత్సవ సంబరాలు

విశాలాంధ్ర - భీమిలి : ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ "కళాకృతి" అంశంతో అద్భుత మైన భారతదేశ సంబరాలు పేరిట 15వ వార్షికోత్సవ వేడుకల పరంపరను ఘనంగా నిర్వహించినది. తొలుత చిన్నారులు భారత దేశ విశిష్ట సంస్కృతి యొక్క ప్రాము ఖ్యతను మరియు గొప్పతనాన్ని విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల మనసులు దోచుకున్నారు. ప్రైమరీ విద్యార్థులు నటించిన మహాభారతం మరియు సెకండరీ విద్యార్థులు నిర్వహించిన దశావతారం కూచిపూడి నాట్య ప్రదర్శణలు ఈ వేడుకలలో మణిహారంగా నిలిచాయి. విద్యార్థులు భారతదేశ జానపద సంబంధిత అనేక కళారూపాల చిత్రాలతో నిర్వహించిన విజువల్ ఆర్ట్ ఎగ్జిబిషన్ విద్యార్థులలోని సృజనాత్మక కళానైపుణ్యతలకు వేదికగా నిలిచి సందర్శకుల ప్రశంసలకు పాత్రమైనవి. ఈనాటి వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన డా.అబ్రహాం వర్గీస్, డైరక్టర్, మరియు శ్రీ మురళి రంభ, అవినీతి నిరోధక శాఖ, విశాఖపట్నం వారు భారతీయ సంస్కృతికి సంబంధించిన అనేక సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా విద్యార్థులు కనపరచిన ప్రతిభను ప్రశంసించారు. కార్యక్రమంలో శైలా భమిడిపాటి, ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 30వ తేదీ ప్రవేశించనున్న వైయస్సార్ సాధికార యాత్ర

విశాలాంధ్ర - మాకవరపాలెం : ఈ నెల 30వ తేదీ శనివారం వైఎస్ఆర్ సాధికార యాత్ర నర్సీపట్నం నియోజకవర్గంలో ప్రవేశించనుందని ఈ యాత్రలో పాల్గొనే రాష్ట్ర మంత్రులుకు మాకవర పాలెం మండలంలో నిర్మాణదశలో ఉన్న మెడికల్ కాలేజీ వద్ద ఘనంగా స్వాగతం పలకాలని వై ఎస్ పార్టీ నాయకులకు స్థానిక ఎంఎల్ఏ పెట్ల ఉమాశంకర్ గణేష్ సూచించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ వద్ద పరిసరాలను ఆయన పరిశీలించారు. శనివారం మంత్రులు మెడికల్ కాలేజీ పనులను పరిశీలించి. అనంతరం నర్సీపట్నం నియోజవర్గంలో పలు గ్రామాల్లో పర్యటిస్తారు అని ఎంఎల్ఏ గణేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ మండల వైయస్సార్ పార్టీ ప్రెసిడెంటు వాసు వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు పెట్ల భద్రాచలం వైస్ ఎంపీపీ రాజారావు చామంతి పురం సర్పంచ్ బొడ్డు గోవింద లచ్చన్నపాలెం మాజీ సర్పంచ్ వెంకినాయుడు భీమిరెడ్డి గోవింద హరిబాబు మాకవరపాలెం ఎంపిటిసి సర్వం రాచపల్లి మాజీ సర్పంచ్ పెట్ల దొరబాబు వైయస్సార్ నాయకులు పాల్గొన్నారు

స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ సేవలు మరువలేనివి..!

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి : సమాజ సేవే పరమావదిగా భావించి ఎనలేని సేవలు అందిస్తున్న స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కలిగొట్ల శ్రీరాంమూర్తి ఈ ప్రాంతానికి అందిస్తున్న సేవలు మరువలేనివని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి గౌరవ అధ్యక్షులు గంటా నూకరాజు అన్నారు. స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ నుండి భీమిలి శాఖ ఆదర్స్ హిందీ ప్రేమిమండలి విద్యార్థులకు హిందీ పుస్తకాలను విరాళంగా ఇచ్చారు. ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి వ్యవస్థాపక అధ్యక్షులు కె. ఎస్. ఆర్. కృష్ణారావు సమక్షంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గంటా నూకరాజు చేతులమీదుగా పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అనే సందర్భాన్ని ఆదర్శంగా తీసుకొని కలిగొట్ల శ్రీరాంమూర్తి స్థానిక ప్రజలకు విశిష్టమైన సేవలు అందిస్తున్నారని అన్నారు. పేద విద్యార్థుల చదువుల కోసం, దివ్యాంగుల సంరక్షణ కోసం, వృద్ధుల ఆశ్రయం కోసం ఈ విధంగా చేస్తున్న సేవలు అభినంద నీయమని అన్నారు. అవసరాన్ని బట్టి మెడికల్ క్యాంపులు పెట్టి వారికి కావలసిన మందులు ఇవ్వడం, ఆయుర్వేదిక్ మందులు కూడా అందించడం శుభపరిణామమని అన్నారు. ఈ విధంగా సేవలు అందించడం ద్వారా ఆపదలో ఉన్న సాటివారి కష్టాలను కొంతవరకు అయినా తీర్చే అవకాశం లభించినట్లు ఉంటుందని గంటా నూకరాజు ఆశాభావం వ్యక్తం చేసారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు

విశాలాంధ్ర - నర్సీపట్నం : ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నర్సీపట్నం నియోజకవర్గం, నర్సీపట్నం మున్సిపాలిటీకి చెందిన చల్లా సతీష్ వార్కి 2,50,000 వేల రూపాయలుబీ భీమిరెడ్డి శారద వార్కి 18,000 వేల రూపాయలు, చొప్పున మొత్తం 2,68,000/- (రెండు లక్షల అరవై ఎనిమిది వేల రూపాయాలను శాసన సభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్ ప్రత్యేక చొరవతో గౌరవ ముఖ్యమంత్రి వర్యులు జగన్ మోహన్ రెడ్డి మంజూరు చేశారు. ఆదివారం ఉమాశంకర్ గణేష్ చేతుల మీదుగా లబ్దిదారులకు చెక్కులను అంద జేశారు. సదరు బాధిత కుటుంబములకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం మంజూరు చేసి వారి యొక్క కుటుంబానికి భరోసా కల్పించన గౌరవ ముఖ్యమంత్రికి అందుకు కృషి చేసిన నర్సీపట్నం శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్‌కు లబ్దిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మునిసిపాలిటికి ప్రజా ప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.